ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్క్రాప్ దుకాణాలు

- నిబంధనలకు పాతర, పొంచి ఉన్న ప్రమాదం
- కాగజ్‌నగర్‌లో యథేచ్ఛగా స్క్రాప్ దందా

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 28: కాగజ్‌నగర్‌లో స్క్రాప్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. పట్టణంలో పుట్టగొగుల్లా ఈ దుకాణాలు వెలుస్తున్నాయి. అనుమతులు, లైసెన్సులు లేకుండానే ఈ వ్యాపారం ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. అధికారులకు ముడుపులు అందజేయటంతో ఈ దుకాణాలపై వైపు వారు కనీసం కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి. కాగజ్‌నగర్ ప్రధాన రహదారి సమీపంలో గోడౌన్‌లు ఏర్పాటు చేశారు. గతంలో పలు చోరీలు జరగగా ఆ చోరీ వస్తువులు స్క్రాప్ దుకాణాల వారు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే విద్యుత్ వైర్లు అపరహణ జరుగుతున్నాయి. వాస్తవంగా ఈ వ్యాపారంలో వినియోగంలోకి రానివి, చెడిపోయిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పలు స్క్రాప్ దుకాణాల్లో ఏకంగా చోరీకి పాల్పడిన వస్తువులను తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అతి తక్కువ ధరకు చోరీకి పాల్పడిన వస్తువులను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. పైగా వీటికి సంబంధించి ఎలాంటి పన్నులు కట్టకుండానే సామగ్రి తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోందనే ఆరోపణలున్నాయి.

పట్టణంలో పలుచోట్ల ఏకంగా నివాసగృహాల పక్కను ఇనుప విడి భాగాలు ఉంచటంతో వేసవిలో అగ్నిప్రమాదాల సంభవించే అవకాశాలున్నాయి. గతంలోనూ అగ్ని ప్రమాదాలు సంభవించిన దాఖలాలున్నాయి. ఆస్తి, ప్రాణనష్టం జరుగకముందే అధికారులు ముందస్తుగా స్పందించి వీటిపై



చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సిర్పూరు నియోజకవర్గంలోని సిర్పూరు, కౌటాల, బెజ్జూరు, దహెగాం, చింతలమానేపల్లికి చెందిన పలు ప్రాజెక్టులకు సంబంధించిన పరికరాలు కూడా చోరీ చేసి స్క్రాప్ దుకాణాల్లో అమ్ముతున్నట్లు ప్రచారంలో ఉంది. కేవలం తాత్కాలికంగా కేసులు నమోదు చేసి అధికారులు ఈ దందాపై నిఘా పెట్టకపోవటంతో వీరి వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా కార్లు, ఇతర వాహనాలు చోరీ చేసి ఈ ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు సమాచారం. వీరి వద్ద ఉన్న కట్టర్‌ల ద్వారా వాహనాలను గంటల్లోనే తుక్కు చేసి ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో లారీలు కూడా అపహరణ జరిగినట్లు ఫిర్యాదులు ఉండగా ఇంత వరకు వాటి ఆచూకీ లభించలేదు.

పట్టణం, మండలంలో స్క్రాప్ అపహరించిన వారివద్ద నుంచి కొనుగోలు చేసిన తర్వాత లారీల్లో తూకం వేసి నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ లారీ లోడ్ చేస్తున్న సమయంలోనే చోరీ చేసిన వస్తువులు కూడా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అధికారులు గట్టి నిఘా పెట్టి వీరి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ కరుణాకర్‌ను సంప్రదించగా తుక్కు వ్యాపారంపై గట్టి నిఘా పెడుతున్నామన్నారు. అలాగే చోరీలపై ఇతర క్రయ, విక్రయాలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

2న ఆసిఫాబాద్‌కు రానున్న సీఎం



జిల్లాకేంద్రంలో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే2న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్ జిల్లాకేంద్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి సీతక్క జిల్లా నాయకులతో కలిసి సీఎం పర్య టనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. పట్టణంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో జనాలను సమీకరించేందుకు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధినాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సీఎం సభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టాలని నాయకులకు సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థినికి కాంస్య పతకం



అథ్లెటిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన అంజలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 28: ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆత్రం అంజలి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఆదివారం సూర్యాపేట జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అండర్16 బాలికల వందమీటర్ల పరుగు పందెంలో అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా అంజలిని డీడీ రమాదేవి, క్రీడల అధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, కోచ్‌లు అరవింద్, తిరుమల్ అభినందించారు.

భానుడి భగభగలు

- జిల్లాలో 44.6డిగ్రీల ఉష్ణోగ్రతలు



తాటి ముంజలు అమ్ముతున్న వ్యాపారి



ఎండవేడిమికి టవల్‌ను తలపై వేసుకున్న మహిళ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 28: ఎండలు దంచి కొడుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒకదిక్కు ఎండవేడిమి, మరోదిక్కు వేడి వడగాలులతో జనం సతమతమవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తనఉగ్ర రూపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నంవేళలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇండ్ల లోనే ఉంటూ కూలర్లు, ఏసీలతో ఎండ వేడిమి నుంచి ఉపశ మనం పొందుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో శీతలపానీయాల విక్రయాలు జోరందుకున్నాయి. తాటిముంజలను పెద్దసంఖ్యలో విక్రయిస్తున్నారు. ఏప్రిల్ చివరిలోనే ఎండలు దడ పుట్టిస్తుంటే ఇక మే నెలలో ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు..

జిల్లాలో ఆదివారం 44.6డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణిలో44.6, ఆసిఫాబాద్‌లో 44.5, కాగజ్‌నగర్‌లో 44.4, పెంచికల్‌పేటలో 43.8, రెబ్బెనలో 43.7, దహెగాంలో 43.3, బెజ్జూర్‌లో 43.1, కౌటాలలో 42.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రిజర్వేషన్ల తొలగింపునకు కుట్ర పన్నుతోన్న కేంద్రం



కెరమెరిలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీ నాయకులు



ఆసిఫాబాద్ అంకుశాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 28: బీజేపీ పాలనలో అట్టడుగువర్గాలకు ఆత్మ గౌరవం మిగిలే పరిస్థితి లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తొలగించి వాళ్లకి తీరని అన్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని అప్పపెల్లి, మోతుగూడ, అంకుశాపూర్ గ్రామాల్లో పర్యటించి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తొలగించి పేదల హక్కులను కాలరాసే విధంగా మోదీ ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఆ అప్పులకు ఇప్పటివరకు రూ.29వేల కోట్ల వడ్డీని రాష్ట్రప్రభుత్వం చెల్లించిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే రిజర్వేషన్లు, హక్కులు ఉంటాయని దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మంత్రికి పలు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి సోదరుడు సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మంత్రి సీతక్క సరస్వతి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రెబ్బెన మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీఎమ్మెల్సీ పురాణం సతీష్, నియోజకవర్గనాయకుడు శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, ఓయూ జేఏసీ నాయకుడు అనిల్, పార్టీమండల అధ్యక్షుడు చరణ్, మహిళ నాయకురాళ్లు మంగ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నిధులన్నీ గుజరాత్, యూపీలకేనా?

కెరమెరి: కేంద్రప్రభుత్వం నిధులన్నింటినీ గుజరాత్, యూపీ రాష్ట్రాలకే కేటాయిస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కెరమెరి మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన సభకు ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రిగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం గుజరాత్, ఉత్తర ప్రదేశ్‌లకే నిధులన్నీ దోచి పెడుతున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో జన్ ధన్ ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పిప్రజలను మోసం చేశారన్నారు.

జిల్లాలో మాలీ కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నారని ఎన్నికల కోడ్ అనంతరం వారి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. అలాగే మాలీ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్‌పార్టీ ధ్యేయమని రాబోయే ఎన్నికలలో బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓటుతో తగినబుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పలు సమస్యలపై ఆయాగ్రామాల ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాంనాయక్, నాయకులు మునీర్ అహ్మద్, బాలేష్‌గౌడ్, గాదవేణి మల్లేష్, ఆత్రం లక్ష్మణ్, శ్రీనివాస్, కుసుంరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీ నాయకులు..

మంత్రి సీతక్క సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి జిల్లా మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా మైనార్టీనాయకులు అబ్దుల్లా, అమనుల్లా పర్వేజ్, తన్వీర్‌తో పాటు సుమారు 40మందికి పైగా మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీ నాయకులకు మంత్రి సీతక్క కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెరమెరి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒక చోట చేరిన 2002-03బ్యాచ్ విద్యార్థులు

వాంకిడి, ఏప్రిల్ 28: వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు 22సంవత్సరాల తరువాత ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆడిపాడారు. ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. తమ కుటుంబసభ్యుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం పాఠశాలలో కలిసి విందు భోజనాలు చేశారు. అప్పటి హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులను, పాఠశాల భూదాతను ఆహ్వానించి సత్కరించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి మంచిపేరు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులు ఈసందర్భంగా కోరారు. 22సంవత్సరాల తరువాత ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులు ఇమ్రాన్, శ్రీకాంత్, దూడల రవి, సంతోష్, రాజేశ్వర్‌ను ఈసందర్భంగా అభినందించారు.

హడలెత్తిస్తున్న దొంగలు

- భయాందోళనలో ప్రజలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో దొంగల బెడద పెరిగిపోతోంది. నిత్యం రద్దీ ఉండే పెట్రోలు పంపు ఏరియాలోని మున్నీ బార్‌అండ్ రెస్టారెంటు కౌంటర్‌పై ఉన్న రేకులను తొలగించి శుక్రవారం రాత్రి చోరీ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా భట్టుపల్లిలో ఒకరి ఇంటిలో చోరీ చేసి రూ.50వేల నగదు, మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే పట్టణంలోని మరో రెండు చోట్ల కూడా చోరీకి యత్నం చేశారు. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయపడి పోతున్నారు. వేసవి సెలవులు కావటంతో తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు రాత్రి పూట గస్తీ తిరుగుతున్నప్పటికీ దొంగతనాలు జరగడం గమనార్హం. మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు రైళ్ల ద్వారా వచ్చి గతంలో పలు చోరీలు చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో కూడా పలు చోరీలు జరిగిన వాటిలో అంతర్రాష్ట్ర ముఠా దొంగల పని ఉన్నట్లు తేలింది. ఇంతవరకు ఆ కేసులు ఛేదించలేదు. ఈ ప్రాంతంలో చోరీ చేసి తిరిగి మహారాష్ట్రకు వెళ్లి పోతున్నట్లు తేలింది. చోరీలను నివారించేందుకు దుకాణాలు, ఇండ్ల చుట్టు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని పోలీసులు పేర్కొంటున్నారు. రెండ్రోజుల క్రితం జరిగిన చోరీ కేసులో కూడా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కొత్త గనులు ప్రారంభించాలి : బీఎంఎస్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: సింగరేణిలో కొత్తగనులు ప్రారంభించి యువతకు ఉపాధి కల్పించాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టుబోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) కేంద్ర కార్యవర్గసమావేశం ఆదివారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సాధించే వాస్తవ లాభాలపై 40శాతం వాటా ఇవ్వాలన్నారు. పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ, సొంతింటి కల, మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు యాజమాన్యం కృషిచేయాలన్నారు. భూగర్భగనుల్లో వెంటిలేషన్ సదుపాయం కలిగేలా నూతన టెక్నాలజీని వినియోగించాలన్నారు. అనంతరం పలు యూనియన్లకు చెందిన నాయకులు బీఎంఎస్‌లో చేరారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పి మాధవనాయక్, టీఎస్ పవన్‌కుమార్, మంద రవకాంత్, పి వేణుగోపాల్‌రావు, శ్రీనివాసరాజు, వై సారంగపాణి, పెండ్లి మోహన్ రెడ్డి, నాతాడి శ్రీధర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, చెట్టు వీరన్న, ఆకుల హరిణ్, సతీష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా అశోక్



చాట్ల అశోక్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) కేంద్ర ఉపాధ్యక్షుడిగా చాట్ల అశోక్ నియమితులయ్యారు. ఆదివారం నస్పూర్‌లో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని, యూనియన్ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. తనకు అవకాశం కల్పించిన బీఎంఎస్ బొగ్గుగనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టుబోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐటీయూసీనే కార్మిక చట్టాలను సాధించింది

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య



అభివాదం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: కార్మికచట్టాలను సాధించింది ఏఐటీయూసీ అని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. నస్పూర్‌లోని మనోరంజన్ సముదాయంలో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికసంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు చట్టాన్ని తీసుకొచ్చింది తమ యూనియనే అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు తాము ఎన్నో ప్రాణత్యాగాలు చేశామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించినా ఇంతవరకు గుర్తింపుపత్రం ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే గుర్తింపుపత్రం అందించాలన్నారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నును సంస్థ చెల్లించాలన్నారు. చికాగో అమర వీరుల స్ఫూర్తితో కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు సాబీర్ పాషా, ఉపప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, నాయకులు కొట్టె కిషన్‌రావు, సీపీఐ నాయకులు అక్బర్‌అలీ, మేకల దాసు, చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



కార్మిక చట్టాలను అధ్యయనం చేయాలి

మందమర్రిటౌన్: కార్మికచట్టాలను ప్రతినాయకుడు అధ్యయనం చేయాలని వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటూ కార్మిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్లందు క్లబ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ బ్రాంచ్‌ల ట్రేడ్‌యూనియన్ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏఐటీయూసీ చరిత్ర అందరికీ తెలిసి ఉండాలన్నారు. సింగరేణిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటినుంచి కార్మికులు ఇప్పటివరకు నాలుగుసార్లు గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారన్నారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. సింగరేణివ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల్లో చెప్పిన అంశాలను నాయకులు తప్పనిసరిగా పాటిస్తూ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. బూర్జువా ట్రేడ్ యూనియన్‌లకు, ఏఐటీయూసీకి ఉన్న తేడాలను తెలుసుకోవాలన్నారు. కార్మికుల పక్షాన ఏఐటీయూసీ ముమ్మర పోరాటాలు చేస్తుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్‌తిరుపతి మాట్లాడుతూ హిందుత్వమే ఎజెండాగా ముందుకు వెళ్తున్న పాలకుల విధానాలను ట్రేడ్‌యూనియన్ నాయకులు గమనించాలన్నారు. సింగరేణి రిటైర్డు పర్సనల్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల చట్టాలు, హక్కులను కాపాడేది ఏఐటీయూసీ మాత్రమేనని తెలిపారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేస్తామన్నారు. ఎండీయూసుఫ్ మాట్లాడుతూ సమాజ పరిణామక్రమంలో మార్క్సిస్టు తత్వసూత్రం మూల సూత్రాలను తెలుసుకునేందుకు పుస్తకపఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో అక్బర్‌అలీ, బ్రాంచ్‌కార్యదర్శులు సలేంద్ర సత్య నారాయణ, దాగం మల్లేష్, ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, ఇప్ప కాయల లింగయ్య, తిరుపతిగౌడ్, కంది శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, పిట్ కార్యదర్శులు, మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు, మైనింగ్ సిబ్బంది, ట్రేడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మానకొండూర్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఆదివారం మానకొండూర్‌లో సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. తూర్పు దర్వాజ బస్టాండ్ వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహక రించాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు డబ్బు తీసుకెళ్తున్న వారు ఆధారాలు ఉంచుకోవాలని చెప్పారు. 50వేల రూపాయలకు మించి తీసుకెళితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

మంగళసూత్రం చోరీ

కాసిపేట, ఏప్రిల్ 28: ఆరుబయట నిద్రిస్తున్న మహిళపై దాడిచేసి మంగళ సూత్రాన్ని ఎత్తుకెళ్లినఘటన శనివారంరాత్రి దేవాపూర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబడితండా(డీ)లో చోటుచేసుకుంది. శనివారం రాత్రి బామండ్లపెల్లి సత్తవ్వ -రాజయ్య దంపతులు ఇంటిబయట నిద్రపోయారు. తెల్లవారుజామున 2 గంటలప్రాంతంలో ఓవ్యక్తి సత్తవ్వ మెడలో నుంచి మంగళసూత్రాన్ని లాగాడు. సత్తవ్వ ఉలిక్కిపడి లేచి దొంగతో పెనుగులాడింది. దీంతో మంగళసూత్రానికి ఉన్న బంగారు గుండ్లు, తాళిబొట్టు కింద పడిపోగా పావు తక్కువ రెండు తులాల బంగారు తాడుతో దొంగ పరారయ్యాడు. దొంగ సత్తవ్వ ముఖంపై కారంపొడి చల్లడంతో రోడ్డుపై కుప్పకూలిపోయింది. సత్తవ్వ అరుపులు విని స్థానికులు దొంగ కోసం వెతకగా కనిపించకుండా పోయాడు. ఆదివారం ఉదయం సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిసరాలను పరిశీలించారు. బాధిత మహిళ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజనేయులు తెలిపారు.

యువకులు, విద్యార్థులు
అన్ని రంగాల్లో ముందుండాలి

భీమిని, ఏప్రిల్ 28: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువకులకు, విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. యువత గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా క్రీడాపరికరాలు పంపిణీ చేశామన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

హాజీపూర్, ఏప్రిల్ 28: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో చాలా వరకు అమలు చేశామన్నారు. ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని సమస్యలన్నింటిని పరిష్కారిస్తామన్నారు. ముల్కల గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు చెప్పగా మిషన్ భగీరథ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల అధ్యక్షుడు తోట రవి, మహిళ అధ్యక్షురాలు భైరం లక్ష్మీ, నాయకులు రమేష్, సురేందర్, కుమార్ యాదవ్ , సత్తయ్య లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు


ముల్కల్లలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

శ్రీరాంపూర్: బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి మాజీ ఎంపీటీసీ ఏల్పుల రవీందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్తు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 28: కాంగ్రెస్‌తోనే దేశ ప్రగతి, ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎన్నో ఇబ్బందులు తాను ఎదుర్కొన్నానని, పటాన్ చెరువులోని తన పరిశ్రమను మూసివేయించారని, అయినా తాను భయపడలేదన్నారు. ఐటీ, ఈడీల దాడులకు భయపడే పరిస్థితి లేదని, తాను సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు గమనించాలన్నారు. నిరుద్యోగ నిర్మూలన, ప్రజల సంక్షేమం, పరిశ్రమల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దు

దండేపల్లి,ఏప్రిల్ 28: కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం రాత్రి దండేపల్లిలో ఎన్నికల ప్రచార సభలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో ఎన్నికల సభకు హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండ ప్రజలను మోసం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలో కూడా ప్రజలను మోసం చేసేందుకు మోసపూరిత హామీలను ఇస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. చుంచు శ్రీనివాస్, అనిల్‌కుమార్, అక్కల రవీందర్, నడిపెల్లి విజిత్‌రావు పాల్గొన్నారు.

నస్పూర్: మున్సిపాలిటీలోని 24, 25వార్డు గోదావరి కాలనీలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. కార్మిక కాలనీలో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారం చేశారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందినట్లు ఆరోపించారు. అక్కురి సుబ్బయ్య, అన్నపూర్ణ, రాజేంద్రపాణి, తిరుపతి, శెట్టి రమణ, పెద్దపల్లి వెంకటేశ్, రఫీక్, దుర్గ ప్రసాద్, మండల క్రాంతి, పాల్గొన్నారు.

ఉచిత అంబలి కేంద్రం ప్రారంభం

లక్షెట్టిపేటరూరల్, ఏప్రిల్ 28: లక్షెట్టిపేటలోని ఉత్కూరు చౌరస్తాలో ఆదివారం కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కేంద్రాన్ని ట్రస్టు సెక్రటరీలు కొక్కిరాల సత్యపాల్‌రావు, రుక్మిణలు ప్రారంభించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజల కోసం ఉచిత అంబలి పంపిణీ చేపట్టామన్నారు. చింత అశోక్‌కుమార్, ఎండీ ఆరీఫ్, రమేష్, చిన్నన్న, వెంకటేశ్వర్లు, శ్రీను, స్వామి, రవీందర్, శ్రీధర్, నవాబ్, అమీర్, నాగార్జున, రమేష్ పాల్గొన్నారు.

నస్పూర్: కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ట్రస్టు కార్యదర్శి కొక్కిరాల సత్యపాల్ రావు-రుక్మిణిలు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, నాయకులు దారవేని సీపతి మల్లేష్, తిరుపతి, పుట్ట యశోద, గోపతి తిరుపతి, కొండ్ర లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రస్ట్ కార్యదర్శి కొక్కిరాల సత్యపాల్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, చలివేంద్రాలతో పాటు అంబలి కేంద్రాలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఏసీసీ: కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబలి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐబీ చౌరస్తా, బస్టాండ్ ఎదురుగా, కూరగాయల మార్కెట్ ఏరియాలో ఉచిత అంబలి పంపిణీ కేంద్రాలను ట్రస్టు కార్యదర్శి సత్యపాల్‌రావు ప్రారంభించారు. రుక్మిణి, తూముల నరేష్, ఉప్పలయ్య , నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మంచిర్యాల, దండేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి, ఏప్రిల్ 28: రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006-07లో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ళ క్రితం పదో తరగతి వరకు చదువుకున్న వారు చిన్ననాటి జ్ఞాప కాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి గురువుల సన్మానించారు. సాయంత్రం ఆటాపాటలతో సంతోషంగా గడిపారు.

ఏసీసీ : మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి దేవరాజు, ఉపాధ్యాయులు అంజలి, మాధవి, ఉష, భాగ్యలక్ష్మీ, మనోహర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ అయ్యానని విద్యార్థి ఆత్మహత్య


కార్తికేయ (ఫైల్)

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: ఇంటర్ ఫెయిలయ్యాననే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పులి కార్తికేయ(18) మంచిర్యాలలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. మనస్తాపం చెందిన కార్తికేయ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడి తల్లి దేవలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

లక్షెట్టిపేటరూరల్, ఏప్రిల్ 28: కొత్తూరు గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బావిలో పడి లాల్‌దాస్‌కొంరే (31) అనే మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం స్వగ్రామానికి చెందిన మరో నలుగురు మిత్రులతో కలిసి లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో గల మామిడి కాయల మండీలో పనిచేయడానికి వచ్చాడు. ఒక్కరోజు మాత్రమే పనిచేసి కూలీ డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం కొత్తూరు గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో నడుచుకుంటూ వెళ్లి బావిలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి బావమరిది అయిన సంజీవ్‌దుర్వే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్, ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

వాహన తనిఖీల్లో నగదు సీజ్

దండేపల్లి, ఏప్రిల్ 28: గూడెం చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న ఇద్దరి నుంచి రూ.1,35,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భూమేష్ పేర్కొన్నారు. రాయపట్నం నుంచి లక్షెట్టిపేట వెళుతున్న వాహనంలో ప్రయాణిస్తున్న రాందేని రాజయ్య వద్ద రూ.69వేలు, జాగిర్తి వెంకటేష్ రూ.61,500 స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జిలు విజయప్రసాద్‌కు అప్పగించినట్లు తెలిపారు ఏఎస్సై రాజేందర్ ఉన్నారు.

కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

జన్నారం, ఏప్రిల్ 28: మండలంలోని పొనకల్ గ్రామ శివారులో ఉన్న సొంత భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన వృద్ధురాలు సల్వాజీ గంగలక్ష్మీ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ పొనకల్ శివారులోని సర్వే నెంబరు 361లో 1.16 గుంటల భూమిలో 40 సంవత్సరాలుగా కాస్తులో ఉండడమే కాకుండా పొజిషన్‌లో ఉన్నా కావాలని కొందరు వ్యక్తులకు భూమిలోకి వచ్చి తమపై దాడికి ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలోనే తహసీల్దార్ విచారణ చేసి తమదేనని సర్టిఫైడ్ చేశారని, అయినా నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయడానికి చూస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రవికుమార్

బెల్లంపల్లి, ఏప్రిల్ 28 : తెలంగాణ మాలమహానాడు బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా సోగాల రవికుమార్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ ఆదివారం జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్ వెంకటేశ్వర్లు నియామక పత్రం అందించారు రాజేష్, ప్రతాప్, సమ్మయ్య పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐపై సస్పెన్షన్ వేటు

- మూడు నెలలుగా విధులకు హాజరు కాకపోవటమే కారణం
- నూతన ఎక్సైజ్ సీఐగా రవికుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28: కాగజ్‌నగర్ ఎక్సైజ్‌సీఐ శ్యామ్యుల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. ఫిబ్రవరి 19న కాగజ్ నగర్ ఎక్సైజ్ సీఐగా శ్యామ్యుల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన తరుచూ విధులకు హాజరు కాకపోవటంతో ఉన్నతాధికారులు పలుమార్లు మందలించారు. సిర్పూరు నియోజకవర్గంలో పలు మద్యం దుకాణాల్లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోలేదు. అలాగే కల్తీ మద్యం అమ్మ కాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నా కూడా చూసీచూడనట్లు వ్యవహరించినట్లు ఆరోపణ లున్నాయి. సిర్పూరు నియోజకవర్గలో పలు మద్యం దుకాణాల్లో ప్రింట్ రేట్ కంటే అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని వీడియో ఆధారాలతోసహా ఎక్సైజ్ సీఐకి పలువురు ఫిర్యాదు చేశారు.

నాలుగురోజుల్లో చర్యలు తీసుకుంటామని..? సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. కానీ కనీసం విచారణ కూడా జరుపలేదు. దీంతో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 24న కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో పట్టుబడిన వాహనాలకు వేలం వేయగా, ఈ టెండరు ప్రక్రియలో కూడా సీఐ శ్యామ్యుల్ పాల్గొనలేదు.

స్వయంగా జిల్లా ఎక్సైజ్ అధికారి ఈ వేలం ప్రక్రియను దగ్గరుండి నడిపించారు. కాగజ్‌నగర్ సీఐ శ్యామ్యుల్‌పై వచ్చిన ఫిర్యాదులపై జిల్లాఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సస్పెండు చేశారు. ఉట్నూరు సీఐగా పని చేస్తున్న రవికుమార్‌ను కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సీఐ రవికుమార్ ఆదివారం బాధ్యతలు కూడా స్వీకరించారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు


సమావేశంలో మాట్లాడుతున్న వంగూరి రాములు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పిలుపునిచ్చారు. ఆదివారం రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించినట్టు తెలిపారు. కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండు చేసినప్పటికీ ఇంత వరకు ఆచరణలోకి తీసుకురాలేదన్నారు. 29కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చినట్టు పేర్కొన్నారు. ఈకోడ్‌తో కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోయినట్టు వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ డిమానిటైజేషన్ ద్వారా 15కోట్ల మంది రోజువారి కూలీలు ఉద్యోగాలు కోల్పోయినట్టు తెలిపారు. సమావేశంలో సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ త్రివేణి, శ్రీకాంత్, సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు శంకర్, సంజీవ్, కృష్ణమాచారి, విలాస్, అంకయ్య, విఠల్, చంద్రకళ, రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఆర్‌జేసీ, ఆర్‌డీసీ ప్రవేశపరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 28: మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ ప్రవేశాల కోసం ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం 583 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 515మంది రాశారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశం కొరకు 419మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 385 మంది హాజరైనట్లు కన్వీనర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఆయా పరీక్షకేంద్రాలను కన్వీనర్ వెంకటప్రసాద్, జిల్లాపరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు తనిఖీ చేశారు.

మంచిర్యాలలో..

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 28 : మంచిర్యాలలోని 8 పరీక్షకేంద్రాల్లో ఆదివారం ఎంజేపీఆర్‌జేసీ సెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లాకన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. జిల్లాకేంద్రంలో 1327మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా 1201 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, అలాగే 578 మంది డిగ్రీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా 540 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ నుంచి వచ్చిన ఎంజేపీ జాయింట్ సెక్రెటరీ తిరుపతి సందర్శించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అర్షద్ హుస్సేన్

బెజ్జూరు, ఏప్రిల్ 28: బెజ్జూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్‌గా అర్షద్ హుస్సేన్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో చైర్మన్‌గా ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగంపై పదవి నుంచి తొలగించగా, ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కోర్టుచైర్మన్‌గా నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా చూస్తానన్నారు. అనంతరం చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీఈవో సంజీవ్, డైరెక్టర్ శ్రీహరి, నాయకులు రాజారాం, ఖాజా మోయినోద్దీన్ తదితరులు ఉన్నారు.


పీఏసీఎస్ చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్న అర్షద్ హుస్సేన్

ఇంటింటా బీజేపీ ప్రచారం


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28: బీజేపీకి చెందిన ఎంపీ అభ్యర్థి గోడెం నగేష్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మచ్చలేని పాలన అందించినట్టు తెలిపారు. వచ్చే నెలలో జరిగే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్‌కు ఓటేసి గెల్పించాలని కోరారు. కాగజ్‌నగర్ వార్డులతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

రెబ్బెనలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

రెబ్బెన, ఏప్రిల్ 28: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే నెలలో జరిగే ఎంపీ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, ప్యాక్స్ చైర్మన్ కార్నాతం సంజీవ్‌కుమార్, వైస్‌చైర్మన్ రంగు మహేష్ గౌడ్, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు జహురుద్దీన్, అన్నపూర్ణ, అరుణ, మురళీగౌడ్, కుందారపు శంకరమ్మ, మన్యం పద్మ తదితరులు పాల్గొన్నారు.

'జీవన యానం' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ దామోదర్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ప్రముఖ కవి శ్రీరామోజు లక్ష్మిరాజయ్య రచించిన జీవనయానం ఆత్మకథ పుస్తకాన్ని పట్టణ ప్రముఖులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ సాహిత్యరంగంలో ప్రఖ్యాతకవి శ్రీరామోజు లక్ష్మిరాజయ్య తనకంటూ ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నట్టు తెలిపారు. తను రచించిన రచనలు అందరినీ ఆకట్టుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పట్వర్ధన్, కాగజ్‌నగర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, ప్రముఖవైద్యుడు డాక్టర్ దామో దర్, డాక్టర్ సునీత రావూజీ, జిల్లా సైన్స్ అధికారి మధూకర్, తిరుపతయ్య, చిలుకూరి సత్యనారాయణ, తెలుగు సాహితీ సదస్సు సభ్యులు పాల్గొన్నారు.

సరిహద్దు వైపు ఏనుగుల గుంపు



జిల్లా సరిహద్దులోకి ఏనుగుల గుంపు వచ్చే అవకాశం ఉండడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవల కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏనుగు ఇద్దరిని హతమార్చింది. అప్రమత్తమైన అధికారులు ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు. ఏనుగులు అగుపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- అప్రమత్తమైన అటవీ సిబ్బంది
- ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాల్లో నిఘా
- గ్రామాల్లో అవగాహన సదస్సులు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

కోటపల్లి, ఏప్రిల్ 28: ఏనుగుల గుంపు తెలంగాణ వైపు వస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఏనుగుల గుంపు నీటి వనరులు ఉండే తెలంగాణ సరిహద్దులోని ప్రాణహిత, గోదావరి తీరాల వైపు వస్తున్నట్లు ఆ రాష్ట్ర అధికారులు హెచ్చరించడంతో ఇక్కడి అటవీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇటీవల కుమరంభీం జిల్లాలోకి మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి ప్రవేశించిన ఓ ఏనుగు రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు రైతులను చంపిన విషయం తెలిసిందే. అటవీ అధికారులు నానా తంటాలు పడి ఏనుగును దారి మళ్లించడంతో అది తిరిగి మహారాష్ట్రలోని ఏనుగుల మందలో చేరింది. మందను చేరిన ఏనుగు గుంపుతో కలిసి తిరిగి తెలంగాణ వైపు కదులుతున్నట్లు మహారాష్ట్ర అటవీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆళ్లపల్లి నుంచి గడ్చిరోలి వైపు సంచరిస్తున్న ఏనుగుల గుంపు ప్రాణహిత, గోదావరి నదుల పరివాహక ప్రాంతాల వైపు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో అధికారులు అలర్ట్ ప్రకటించారు. ఈ రెండు జిల్లాల అటవీ అధికారులతో పాటు వ్యవసాయ, పశువైద్య, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏనుగుల ప్రవర్తనను అధ్యయనం చేసేం దుకు ఇక్కడి యంత్రాంగం ఛత్తీస్‌గఢ్ అటవీ సిబ్బందితో సంప్రదింపులు జరుపుతోంది. ఇటీవల మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అటవీ అధికా రులు గడ్చిరోలి జిల్లా అటవీ అధికారులతో సమావేశమయ్యారు. ఆసిఫా బాద్ జిల్లాలో సంచరించిన ఏనుగు ఆహారం, నీటి వనరులను కనుగొనేం దుకే ఇక్కడకు వచ్చి ఉంటుందని తిరిగి మందను చేరిన ఏనుగు గుంపును తీసుకుని ఈ ప్రాంతానికి వస్తున్నట్లు అధికారులు విశ్వసిస్తు న్నారు. పంట పొలాలు, చెరుకు, పుచ్చకాయ తోటలు, నీరు ఉండడంతో ఏనుగుల మంద ఆసిఫాబాద్ జిల్లాలో ప్రవేశించే అవకాశం ఉన్నట్లు అధి కారులు అనుమానిస్తున్నారు.

• అప్రమత్తం.... అవగాహన

ఏనుగుల గుంపు తెలంగాణ వైపు కదులుతుందనే సమాచారం మేరకు జిల్లా అటవీ యంత్రాంగం అప్రమత్త మైంది. గోదావరి, ప్రాణహిత నది తీర ప్రాంతాల వైపు నిఘా పెట్టిన అధికారులు సరిహద్దు గ్రామాల ప్రజలను అలర్ట్ చేస్తున్నారు. ప్రాణహిత నదిలో నీరు ఉండడంతో ఏను గుల గుంపు వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాంత అడవులు ఏనుగుల సంచారానికి అనుకూలంగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. పెద్ద పులులకు కారిడార్ ఉన్నట్లే ఏనుగులు సైతం ఆహారం, నీటి వనరుల కోసం కారిడార్ ఏర్పాటు చేసుకుంటాయని, ఈ దశలో భాగంగానే తెలం గాణ వైపు వచ్చే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయ పడుతు న్నారు. ఏనుగుల సంచారం రాత్రిపూట ఎక్కువగా ఉంటుందని, నైట్ విజన్ డ్రోన్ కెమెరాలను వినియోగించాలని అటవీ శాఖ భావిస్తోంది. కోటపల్లి, వేమనపల్లి, చెన్నూరు తదితర మండలాల్లో ఇప్పటికే అటవీ అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి అప్రమత్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామాల్లో చాటింపు చేపట్టారు. ఏనుగుల సంచారం తెలిస్తే సమాచారం ఇవ్వాలని, ఏనుగులకు కంటి చూపు తక్కువని, వినికిడి ఎక్కువగా ఉంటుందని, దూరం నుంచే వాసన పసిగడుతుందని, తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఏనుగుల గుంపు గ్రామాల్లోకి వస్తే ప్రజలు సిమెంటుతో నిర్మించిన పక్కా ఇండ్లలోకి వెళ్లాలి.
- ఏనుగుల గుంపు గ్రామంలోకి వస్తుందని తెలిస్తే గ్రామ సరిహద్దులో కాగడాలు వెలిగించడంతోపాటు మిర్చి పొడి స్ప్రే చేస్తే ఏనుగులు దారి మళ్లుతాయి.
- వాహనాల్లో వెళ్తున్న సమయంలో ఏనుగు రోడ్డు క్రాస్ చేస్తుంటే దూరంలోనే వాహనాలు నిలిపివేయాలి. దగ్గరకు వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయకూడదు. రాత్రివేళల్లో అయితే వాహనాల లైట్లు ఆర్పివేయాలి.
- ఏనుగు గంటకు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఒంటరిగా ఉన్న ఏనుగుతోనే ఎక్కువగా ప్రమాదం ఉంటుంది.
- ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ఏనుగులపై రాళ్లు, బాటిళ్లు విసరవద్దు. వాటిని రెచ్చగొట్టవద్దు.
- అటవీ ప్రాంతంలో వెళ్తున్నప్పుడు పర్‌ఫ్యూమ్, సువాసనలు వెదజల్లే వాటిని ఉపయోగించవద్దు. ఏనుగు వాసనను దూరం నుంచే పసిగడుతుంది.
- ఏనుగు గ్రామం నుంచి వెళ్తున్నప్పుడు వెంబడించవద్దు. దానిని ఆందోళనకు గురి చేస్తే అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి

- రవి, అటవీ శాఖ రేంజర్, కోటపల్లి,



ఏనుగుల సంచారం, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఏనుగుల సంచారం తెలిస్తే సమాచారం అందించాలి. నదుల తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోడ్డుపై ఏనుగు కనిపిస్తే రెచ్చగొట్టద్దు. దగ్గరకు వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయవద్దు. వాహనాలను నిలిపివేయాలి. ఏనుగు రోడ్డు దాటాకే ముందుకు కదలాలి. ఏనుగులను వెంబడించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జైపూర్, ఏప్రిల్ 28: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అద నపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లోని వసతులు, గన్నీ సంచులు, ధాన్యం రవాణా అంశాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొం దాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని, రైతులు ధాన్యాన్ని మట్టి, బెడ్డలు లేకుండా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. టేకుమట్లలోని జయలక్ష్మీ రైసుమిల్లు, మంజునాధ రైసు మిల్లులను తనిఖీ చేశారు.

విద్యార్థిని అభినందించిన గ్రామస్థులు



సాయిజ, శృతిని సన్మానిస్తున్న గ్రామస్థులు

చెన్నూరు, ఏప్రిల్ 28: మండలంలోని పొక్కూరు గ్రామానికి చెందిన చీర్ల దివాకర్-సునీత దంపతుల కుమార్తె సాయిజను ఆదివారం గ్రామ స్థులు సన్మానించారు. సాయిజ హన్మకొండలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచింది.

తాండూర్: మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన విద్యార్థిని శృతిని మున్నూరు కాపు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. మహేందర్, సత్యనారాయణ, మల్లేష్, సత్యనారాయణ, రాజేందర్, సంజీవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం ఇస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 28: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షికి మంచిర్యాలలో వినతి పత్రం అందించారు. ఆటోయూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు సౌకర్యంగా ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఆటో కార్మికులకు న్యాయం చేయాలన్నారు. నెలకు రూ.12 వేలు, ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షలు అందిం చాలని, రూ.5 లక్షల బీమా కల్పించాలని విన్నవించారు. మేడి రాజు,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. కవి ముత్యబోయిన మలయశ్రీ మాట్లాడుతూ తెలుగు భాష అత్యంత మధురమైందని, చిన్నప్పటి నుంచే పిల్లలకు మాతృభాష గొప్పతనాన్ని తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. అనంతరం సమితి ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు సుగుణాకర్, సత్తయ్య తదితరులు కవులు వారి వారి కవితలను వినిపించారు.

సేంద్రియ ఉత్పత్తుల మేళా

ఏసీసీ, ఏప్రిల్ 28: సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన వ్యవ సాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాన్ని ఈ నెల 30, మే 1న జిల్లా కేం ద్రంలో నిర్వహించనున్నట్లు సేంద్రియ ఉత్పత్తి వ్యవసాయదారుల సం ఘం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో మామిడిపండ్లు, మిల్లెట్లు, పిండి వంటలు, ఆర్గానిక్ బెల్లం తదితర ఉత్పత్తుల ప్రదర్శన, విక్ర యం ఉంటుందన్నారు. రైతులు విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ధ్యాన శిక్షణ

ఏసీసీ, ఏప్రిల్ 28: జిల్లా కేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉచిత ధ్యాన శిక్షణ ఆదివారం ముగిసింది. బార్ అసోసియేషన్ అధ్య క్షుడు జగన్, ప్రధాన కార్య దర్శి మురళీకృష్ణ, ఉపాధ్య క్షుడు గంగయ్యలు సంస్థ ప్రతినిధులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. లైబ్రరీ ఇన్‌చార్జి గురువయ్య, సం తోష్‌గౌడ్, న్యాయవాదులు నటేశ్వర్, మల్లయ్య, రవీందర్ రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులు వచ్చే అవకాశం ఉన్నందున
ప్రజలను అప్రమత్తం చేయాలి

వేమనపల్లి, ఏప్రిల్ 28: వేమనపల్లి సరిహద్దులో ప్రవహిస్తున్న ప్రాణహిత నది అవతల మహారాష్ట్ర నుంచి ఏనుగులు మండలంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని నీల్వాయి ఎఫ్‌ఆర్‌వో మహ్మద్ ఇక్బాల్ సూచించారు. ఆదివారం నీల్వాయి రేంజ్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌తో కలిసి అటవీ సిబ్బంది, పంచాయతీ కార్యర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏనుగుల రాకపై గ్రామాల్లో పంచాయతీ కార్య దర్శులు అవగాహన కల్పించాలన్నారు. ఏనుగులు వస్తే వాటిని రెచ్చగొట్టవద్దని సూచించారు. ఇటీవల కుమరంభీం జిల్లాలో ఏనుగులు సృష్టించిన బీభత్సం గురించి తెలియజేశారు. ఏనుగులు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. నదిలో నీరు తగ్గిపోవడంతో సునాయసంగా ఏనుగులు నది దాటే అవకాశాలున్నాయన్నారు. నీల్వాయి ఎస్‌ఐ శ్యాంపటేల్, అటవీ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

జిల్లాలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత

మంచిర్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో ఆదివారం 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాసిపేట మండలం కొండాపూర్, కోటపల్లి మండలం దేవులవాడలో 44.8 డిగ్రీలు నమోదు కాగా, హాజీపూర్ మండలంలో 44.6 డిగ్రీలు, చెన్నూరు మండలంలో 44.5 డిగ్రీలు, భీమారం, జన్నారం మండలాల్లో 44.3 డిగ్రీలు, భీమిని మండలంలో 44.1 డిగ్రీలు, జన్నారంలో కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో 43.9 డిగ్రీలు, బెల్లంపల్లి మండలంలో 43.9 డిగ్రీలు, జైపూర్ మండలంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అనారోగ్యంతో మృతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 28 : అనారోగ్యంతో మాజీ సీడీఎస్ అధ్యక్షురాలు తోడె పద్మారెడ్డి (62) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. కొన్ని రోజులుగా పద్మారెడ్డి అనారోగ్యంగా ఉండడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పద్మారెడ్డి గతంలో సీడీఎస్ అధ్యక్షురాలుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలుగా ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇటీవల ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె మృతి పట్ల పట్టణంలోని పలు పార్టీల నాయకులు, ఎమ్మెల్యే గడ్డం వినోద్ సానుభూతి తెలిపారు.

రాజ్యాంగాన్ని మారుస్తుందని బీజేపీపై దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్

ఏసీసీ, ఏప్రిల్ 28: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలకు ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ప్రధాన మంత్రిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది బీసీలకు స్థానం కల్పించిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా రూ.3 లక్షల రుణం ఇచ్చి బీసీల అభివృద్ధికి మోదీ కృషి చేస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ పార్టీ బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రఘునాథ్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఒకే కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్యే టికెట్లు, ఒక ఎంపీ టికెట్ కేటాయించడం దళితులను అవమానించడమేనన్నారు. పెద్దపల్లి పరిధిలో ఒక్క కుటుంబమే రాజ్యమేలుతుందని ఆ కుటుంబానికి గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పట్ట ణ యూత్ అధ్యక్షుడు బింగి ప్రవీణ్, నస్పూర్ యూత్ అధ్యక్షుడు చల్ల విక్రమ్, పలువురు బీఆర్ ఎస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి కండువా లు కప్పి ఆహ్వానించారు. సంజయ్, దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని, ఇప్పుడు మరోసారి మోసపూరిత మాటలతో ఓట్లు అడుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్ అన్నారు. ఆదివారం పెద్దపేట, లక్ష్మికాంతపూర్, బిక్కునగూడ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకునేందుకు బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. రాజయ్య, గురువయ్య, శ్రీనివాస్, రవిగౌడ్ కిషన్ పాల్గొన్నారు.

అటవీ ఆంక్షలు ఎత్తివేయకుంటే ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జన్నారం, ఏప్రిల్ 28: లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా ఆదిలాబాద్, నిర్మల్‌కు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు భారీ వాహనాల వెళ్లకుండా అటవీ శాఖ విధించిన నిబంధనలు ఎత్తివేయ కుంటే ఉద్యమాలు చేపట్టాలని సామాజిక పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆర్యవైశ్య భవన్‌లో సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అటవీ ఆంక్షల వల్ల వ్యాపారులే కాకుండా ప్రజలు నష్టపో తున్నారన్నారు. వెంటనే అటవీ శాఖ విధించిన ఆంక్షలు ఎత్తివేసి రాకపోకలు సాగించేలా కృషి చేయాలని, లేకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. ప్రజా సంఘాల నాయకులు భూమాచారి, షేక్ అక్బర్, విజయ్, సుదన్‌లాల్, మహేష్ పాల్గొన్నారు.

రూ. కోటి 6 లక్షలకు పైగా
నగదు జప్తు

పెద్దపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటి వరకు కోటి 6 లక్షల 62 వేల 92 రూపాయలను జప్తు చేసి, వీటిలో 92 లక్షల 46 వేల 402 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.5 లక్షల 49 వేల 200, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.37 లక్షల 45 వేల 272, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.11 లక్షల 27 వేల 730 సీజ్ చేయగా, ఆధారాలు పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తి స్థాయిలో నగదును విడుదల చేసిందన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రెటరీ, రోహిత్ చౌదరిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కన్నెపల్లి, ఏప్రిల్ 28: కాంగ్రెస్‌తోనే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామిలు పేర్కొన్నారు. ఆదివారం జన్కాపూర్‌లో నిర్వహించిన చేరికల సభలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి మాజీ సర్పంచులు, వార్డు సభ్యులతో పాటు దాదాపు 800 మంది కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ సృజనసర్సింగరావు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, మల్లీడి, రాంపూర్, వీగాం, చిన్నగుడిపేట, చిన్నతిమ్మాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వీగాం ఎంపీటీసీ కర్నె మమత, మాజీ సర్పంచులు ఎల్లాగౌడ్, సంతోష్, భూమయ్య, కవిత, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహేష్ గౌడ్, నాయకులు ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చేరారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికే చేరికలు

బెల్లంపల్లి: పార్టీ బలోపేతానికే ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటున్నామని ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటున్నామని, పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. పార్టీలో చేరుతున్న వారితో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఎవరి ప్రాధాన్యం వారికే ఉంటుదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం రోహిత్ చౌదరిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, నాయకులు సూరి బాబు, నాతరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచు

మందమర్రిరూరల్ : వెంకటాపూర్ మాజీ సర్పంచు తిరుపతి ఆదివారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.